సాక్షి
కాకినాడ

మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



ట్రిపుల్ ఐటీ సంరంభం..

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)లో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదలైంది.


8లో



రూ.50 వేల విరాళం

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో అన్నదానానికి విమలపూడి సత్యవతి, సత్తిరాజు దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు సత్యనారాయణ రూ.50 వేల విరాళం అందజేశారు.

కడలిలోకి 1,933 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 1,933 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.65 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

పీజీఆర్‌ఎస్‌కు 439 అర్జీలు



వృద్ధురాలి సమస్య వింటున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో ప్రజలు 439 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ షణ్మోహన్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జెడ్పీ సీఈఓ వీవీ లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, కేఎస్‌ఈజెడ్ ఎస్‌డీసీ కేవీ రామలక్ష్మి, సీపీఓ త్రినాథ్ తదితరులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారులు ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు రానవసరం లేదని, మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీ స్థితిగతులు తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు నేరుగా కాల్ చేయవచ్చన్నారు. అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, సక్రమంగా పరిష్కరించని అర్జీలపై రెండు స్థాయిల్లో ఆడిట్ జరిపి, రీ ఓపెన్ చేస్తారని చెప్పారు. అలా ఎక్కువగా అర్జీలు రీ ఓపెన్ చేసిన శాఖ అధికారులకు మెమోలు జారీ చేస్తారని హెచ్చరించారు. అందువలన అర్జీదారు సంతృప్తి చెందే విధంగా అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

సముద్ర నాచు సాగును ప్రోత్సహించాలి

అమలాపురం రూరల్: జిల్లాలో తీరం వెంబడి చెరువు ఆధారిత సముద్రపు నాచు సాగును ప్రోత్సహించాలని, దీనివలన బహుళ ప్రయోజనాలుంటాయని, సహజ పర్యావరణానికి ఇది లాభదాయకమని కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సముద్రపు నాచు సాగు విస్తరణ కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై ఆయన సమీక్షించారు. ఈ నాచు ఉత్పత్తులు సేంద్రియ ఎరువులుగా, పశుగ్రాసంగా, చేపలకు, కోళ్లకు మేతగా, కాస్మెటిక్స్ తదితర రంగాల్లో ఉపయోగపడతాయని, పర్యావరణ హితమైన ఉత్పత్తులను అందిస్తుందని వివరించారు. గచ్చకాయలపోర, ఎస్.యానాం, రాజోలు సముద్ర తీర ప్రాంతాల్లో అనువైన ప్రదేశాలను ఆర్‌డీఓ కె.మాధవి సమన్వయంతో ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. తొలి దశలో 40 మంది ఔత్సాహిక స్వయం సహాయ సంఘాల మహిళలు, మత్స్యకార సంఘాల ప్రతినిధులతో గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. వారికి తమిళనాడులోని రామనాథపురం జిల్లా మండపంలో జరుగుతున్న నాచు సాగుపై శిక్షణ ఇప్పించేందుకు విధివిధానాలు మే రెండో తేదీ నాటికి రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో గ్రీన్ క్లైమేట్ ఫండ్ ప్రతినిధి శ్రీహర్ష, జిల్లా మత్స్యశాఖ, అటవీ, కాలుష్య నియంత్రణ మండలి, వ్యవసాయ, ఉద్యాన అధికారులు పీవీ శ్రీనివాసరావు, ఎంవీ ప్రసాదరావు, శంకరరావు, బోసుబాబు, రమణ, ఎల్‌డీఎం కేశవవర్మ, డీఆర్‌డీఏ పీడీ జయచంద్ర పాల్గొన్నారు.

సర్వ పృష్ఠ ఆప్తోర్యామ యాగంతో అనంత ఫలితం



సచ్చిదానంద తీర్థ స్వామి

అంబాజీపేట: లోక కల్యాణం కోసం నిర్వహించే యాగాల్లో సర్వ పృష్ఠ ఆప్తోర్యామ యాగం ఎంతో అరుదైనదని, ఇది అనంత ఫలితాలనిస్తుందని ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్‌కు చెందిన సచ్చిదానంద తీర్థ స్వామి అన్నారు. తొండవరం గ్రామంలో జరుగుతున్న ఈ యాగాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ, 60 ఏళ్ల క్రితం వరకూ ఈ ప్రాంతంలో ఇటువంటి యాగం జరగలేదన్నారు. ఎంతో నిష్ఠాగరిష్ఠులైన సోమయాజులుకు మాత్రమే ఇటువంటి యాగాలు నిర్వహించే సత్తా ఉంటుందన్నారు, కోనసీమలో ఉద్దండులైన వేద పండితులకు కొదవ లేదన్నారు. శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి ఆశీస్సులతో 2020లో తాను అమరావతి ప్రాంతంలో భారీ ఎత్తున యాగం నిర్వహించానన్నారు. హరిద్వార్‌లో తెలుగు వారికి నిత్యాన్నదానం చేసేందుకు గౌతమీ నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు చేశామని, దీనిని గుంటూరుకు చెందిన వాసుదేవశర్మ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇక్కడ ప్రతి రోజూ రెండు మూడు వేల మందికి భోజనం, ఫలహారం అందిస్తున్నామని వివరించారు. రానున్న సరస్వతీ నది పుష్కరాలకు రోజుకు లక్ష మంది వరకూ తెలుగు వారు వచ్చే అవకాశం ఉన్నందున వారికి భోజనం, ఫలహారం అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని స్వామీజీ వివరించారు.

కొమరగిరిలో భూచోళ్లు

- వట్టా భూముల్లో కూటమి నేతల తిష్ట
- బినామీ రైతులతో గలీజు వ్యవహారం
- మీకు నగం.. మాకు నగం అంటూ కొల్లగొట్టు యవ్వారం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అందిన కాడికి దోచుకు తినడమే కూటమి నేతల పనిగా మారినట్లు కనిపిస్తోంది. చేతుల్లో అధికారం ఉందని, తాము ఏమనుకుంటే అదే అవుతుందని, ఏం చేయాలనుకుంటే అదే చేస్తామని, తమను ఆపే దమ్ము ఎవరికి ఉందనే ధైర్యంతో చెలరేగిపోతున్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్.. ఇలా ఒకటేమిటి అన్నింటా పెత్తనం తమదే అన్నట్లు బరితెగిస్తున్నారు. ఈ దోపిడీ యవ్వారం కాస్తా శృతి మించి, నిరుపేదల కోసం ప్రభుత్వం సేకరించిన భూముల్లో పాగా వేసే వరకూ వెళ్లింది. గ్రామ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు రెవెన్యూ యంత్రాంగం అండదండలు కూడా తోడవడంతో టీడీపీ, జనసేన నేతలు రూ.లక్షలు మింగేస్తున్నారు.

ఏం జరిగిందంటే..

కాకినాడ అర్బన్ పరిధిలో పేదలు, మధ్య తరగతి వర్గాల సొంతింటి కలను సాకారం చేయాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాధినేత, నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. దీనికోసం యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో రైతుల నుంచి 72 ఎకరాలు సేకరించారు. ఇందులో 30 ఎకరాల్లో లే అవుట్లు వేసి, పేదలకు పట్టాలు కూడా ఇచ్చేశారు. మిగిలిన 42 ఎకరాల్లో లే అవుట్ వేయాల్సి ఉంది. ఈ భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం అప్పట్లో పరిహారం కూడా చెల్లించేసింది. ఇక్కడ 350 మంది పేదలకు పట్టాలు కూడా అందచేసింది. భూమి పల్లంగా ఉండటంతో లే అవుట్ చేయడంలో కొంత జాప్యం జరిగింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో లే అవుట్, భూమి అభివృద్ధి పనులు ముందుకు సాగలేదు. నాటి ఎన్నికల్లో టీడీపీ, జనసేన నేతల కల్లబొల్లి హామీలను నమ్మి ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గద్దెనెక్కించారు. అదే ఇప్పుడు పేదలకు శాపంగా.. ఆ పార్టీల నేతలకు కల్పతరువుగా మారింది.



కూటమి నేతలకు కాసులు కురిపిస్తున్న కొమరగిరి భూములు

42 ఎకరాలపై కూటమి నేతల కన్ను

కొమరగిరిలో లే అవుట్ చేయని, రెండు పంటలు పండే సారవంతమైన 42 ఎకరాల భూములపై కొన్నాళ్ల కిందట కూటమి నేతల కన్ను పడింది. రైతులకు పూర్తిగా పరిహారం చెల్లించడంతో ఆ భూములపై ప్రభుత్వానికే సర్వహక్కులూ ఉంటాయి. కానీ, ప్రభుత్వం తమదేనన్న ధీమా, అధికారులు తమ మాట కాదరనే ధైర్యంతో కూటమి నేతలు ఆ భూములను యథేచ్ఛగా తమ చేతుల్లోకి తీసేసుకున్నారు. గత ప్రభుత్వం ఎలాగూ పరిహారం ఇచ్చేసిందనే మిషతో అప్పటి వరకూ ఆ భూములకు యజమానులుగా ఉన్న రైతులను నయానా భయానా బెదిరించి తరిమేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ఆ భూములపై ఆధిపత్యం కోసం టీడీపీ, జనసేన నేతలు వర్గాలుగా విడిపోయారు. ఈ విషయంలో టీడీపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే రంగంలోకి దిగి, ఇరు పార్టీల నేతలకు మీకు సగం.. మాకు సగం అనే పద్ధతిల రాజీ కుదిర్చారు. ప్రభుత్వ ఆధీనంలోని భూములను తాతముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన జిరాయితీ భూముల మాదిరిగా బినామీలకు లీజులకు **ఇచ్చేశారు. రెవెన్యూ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని మీకింత.. మాకింత అంటూ రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. ఖరీఫ్ రబీ సీజన్లు రెండూ కలిపి ఎకరాకు రూ.40 వేలు ఇవ్వాలనేది** నేతలు, బినామీ రైతులు చీకటి ఒప్పందం చేసుకున్నారు. ఇందులో నాలుగో వంతు రెవెన్యూ వర్గాలకు ముట్టజెప్పేందుకు అంగీకారం కుదిరిందని కొమరగిరి కోడై కూస్తోంది. అంటే 42 ఎకరాలకు, రెండు సీజన్లకు కలిపి రూ.16.80 లక్షల మేర కూటమి నేతల జేబుల్లోకి వెళ్లిపోతోంది. ఇదంతా కళ్లెదుటే జరుగుతున్నా అధికార యంత్రాంగం గుడ్లప్పగించి చూస్తుండటంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చేతులు దులుపుకొంటున్న 'రెవెన్యూ'

ఈ భూముల విషయమై అక్కడి రెవెన్యూ అధికారులను అడిగితే కాకినాడ అర్బన్ పరిధిలోని లబ్ధిదారుల కోసం కేటాయించిన భూములని, తమకు ఎటువంటి ప్రమేయమూ లేదని తప్పించుకుంటున్నారు. కాకినాడ రెవెన్యూ అధికారులైతే ఆ భూముల్లో ఎవ్వరూ సాగు చేయరాదని, ఒకవేళ చేస్తే కౌలు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించామని చెబుతూ చేతులు దులుపుకొంటున్నారు. ఈ భూబాగోతం నిగ్గు తేల్చాలని ప్రజాసంఘాలు ఆందోళన బాట పట్టాయి. ప్రభుత్వం పరిహారం చెల్లించిన ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలనే డిమాండుతో సీపీఐ, అనుబంధ వ్యవసాయ కూలీ సంఘాలు ఆందోళన చేస్తున్నాయి.

పేదలకు ఇవ్వాలి



కొమరగిరి భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలి. ప్రభుత్వ భూమిలో అడ్డగోలుగా సాగు చేస్తున్న వారిని ఉపేక్షించడం అన్యాయం. రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఈ భూములు కేటాయించాలి. అర్హులైన వారికి 3 సెంట్ల ఇంటి స్థలం ఇస్తామన్న కూటమి ప్రభుత్వ హామీని వెంటనే కొమరగిరి భూముల్లో అమలు చేసి, చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. అధికారులు చొరవ తీసుకోకుంటే బినామీ రైతులతో సాగు చేస్తున్న వారికి మద్దతు ఇస్తున్నట్లుగానే పరిగణించాల్సి ఉంటుంది. – **తాటిపాక మధు**, సీపీఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ

స్వాధీనం చేసుకునే వరకూ పోరాటం



కొమరగిరి భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే వరకూ పోరాటం ఆపేది లేదు. ఈ భూముల్లో ఇల్లు కట్టుకునేందుకు అర్హులైన 1,400 మంది నిరుపేదల జాబితా రూపొందించి, రెవెన్యూ అధికారులకు అందజేశాం. ఆ జాబితాను పరిశీలించి అర్హులైన వారికి నిబంధనల మేరకు 3 సెంట్ల స్థలం పంపిణీ చేయాలి.

– **నక్కా శ్రీనివాసరావు**, ఉపాధ్యక్షుడు, వ్యవసాయ కార్మిక సంఘం, కాకినాడ జిల్లా

నీట్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కాకినాడ సిటీ: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యాన జరిగే ఈ పరీక్ష ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని 10 కేంద్రాల్లో మే 4వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ నీట్ జరుగుతుందన్నారు. ఓఎంఆర్ విధానంలో జరిగే ఈ పరీక్షకు జిల్లాలో 2,880 మంది హాజరు కానున్నారన్నారు. పరీక్ష కేంద్రాలన్నింటిలోనూ సీసీ కెమెరాలతో నిశిత పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా తగినంత తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అన్ని కేంద్రాల వద్ద బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163 (144 సెక్షన్) కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో ఏఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జె.నరసింహ నాయక్, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థుల నుంచి ఐటీఐలలో మొదటి విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎల్‌ఆర్‌ఆర్ క్రిష్ణన్ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా మే 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకుని, రశీదు పొందాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ మే 24 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ ధవళేశ్వరం సమీపాన కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రభుత్వ ఐటీఐలో జరుగుతుందని వివరించారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ ఐటీఐని కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

చంద్రబాబు ఒత్తిడితోనే పిచ్చి ప్రేలాపనలు



చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: జగన్‌ను తిట్టాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న ఒత్తిడి కారణంగా మంత్రులు పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం గోపాలపురంలో చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. తమ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరి కాదని అన్నారు. వాస్తవాలు మరచిపోయి మంత్రి సుభాష్ జగన్‌పై పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. జగ్గిరెడ్డి ఏమన్నారంటే..

- విశాఖలోని విలువైన భూములను 99 పైసలకే ఉర్సా కంపెనీకి ధారాదత్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఎకరం భూమి రూ.5 కోట్లని చెప్పిన చంద్రబాబు ఉర్సాకు 99 పైసలకే కట్టబెట్టడాన్ని బట్టి మతిస్థిమితం ఉందో లేదో అర్థం చేసుకోవచ్చు.
- 50 ఏళ్లు నిండిన బీసీలందరికీ పెన్షన్ ఇస్తామని ఎన్నికల్లో చెప్పారు. మంచి విమర్శ చేస్తే తీసుకుంటామని మీరన్నారు కదా! ఈ విషయంపై చంద్రబాబుతో మాట్లాడి ఎప్పుడిస్తారో చెప్పాలి.
- చంద్రబాబు గతంలో రూ.1,500 కోట్లతో అమరావతిలో తాత్కాలిక సచివాలయాన్ని వర్షపు నీరు లోపలకు వచ్చేలా కట్టారు. పక్క రాష్ట్రం తెలంగాణలో అప్పటి సీఎం కేసీఆర్ రూ.613 కోట్లతో శాశ్వత సచివాలయం నిర్మించారు. మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక రూ.4,600 కోట్లతో పూర్తి స్థాయి సచివాలయం కడతామని చంద్రబాబు చెబుతున్నారు. ఇలా ప్రజల ధనాన్ని లూటీ చేయడంతో పాటు అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని తీసుకుపోవడం పిచ్చి పనులు అవునో కాదో చెప్పాలి.
- ప్రజల సొమ్ము రూ.40 కోట్లు ఖర్చు చేసి ఇటీవల దావోస్ వెళ్లిన తండ్రీకొడుకులు పెట్టుబడులు ఏం తెచ్చారో చెప్పాలి.
- గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన మెడికల్ కాలేజీ, పోర్టులు, ప్రాజెక్టులను మళ్లీ ప్రారంభించారు. మంత్రి సుభాష్ అన్నట్లుగానే సినిమాటిక్‌గా 'చెల్లికి మళ్లీ మళ్లీ పెళ్లి' అనే తీరుగా చంద్రబాబు పాలన సాగుతోంది. కొత్తగా రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధీ చేయకుండా జగన్ చేసిన వాటినే మళ్లీ కొత్తగా చెప్పుకుంటున్నారు.
- నియోజకవర్గంలో అవినీతి పరాకాష్టకు చేరింది. ఇసుక, మట్టి కాకుండా, బ్యాంకర్ల వరకూ చిట్‌ఫండ్స్ వరకూ చేరింది. ఈ సెటిల్‌మెంట్లు, బి-ట్యాక్స్‌లు వేస్తున్నది ఎవరో చెప్పాలి.
- ఎక్కడ చూసినా కూటమి నాయకుల అవినీతే తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే పనులు కనిపించడం లేదు.
- బీసీ కార్పొరేషన్ లోన్లు, ఇసుక, మట్టి, గిట్టుబాటు ధరలు, అమరావతి పేరిట నాలుగు లేన్ల రోడ్డుకు కిలోమీటరుకు రూ.62 కోట్లు ఖర్చు.. ఇలా అన్నింటా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది.
- వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇవ్వడం లేదు.
- రాష్ట్రంలో అన్ని నిత్యావసరాల ధరలు, పన్నులు, మద్యం, కరెంటు చార్జీలు ఇలా అన్నీ పెంచారు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని తిరిగి ప్రజలకు ఇవ్వకుండా, ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా మోసం చేస్తున్నారు.
- ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతున్నారు. ప్రశ్నించడానికి వచ్చిన పవన్ కల్యాణ్ ఎక్కడున్నారో తెలియడం లేదు.

వాడపల్లి వెంకన్నకు రూ 1.47 కోట్ల ఆదాయం



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ఆలయ హుండీల ద్వారా రూ.1,47,12,969 ఆదాయం వచ్చింది. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఈ విషయం తెలిపారు. ఆలయంలోని హుండీలను 32 రోజుల అనంతరం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సోమవారం తెరిచి, ఆదాయాన్ని వసంత మండపంలో లెక్కించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.1,19,16,439, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.24,51,230 చొప్పున ఆదాయం వచ్చిందని ఈఓ వివరించారు. అలాగే, బంగారం 13 గ్రాములు, వెండి 1.380 కేజీలు, విదేశీ కరెన్సీ నోట్లు 64 వచ్చాయన్నారు. క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామివారి ఆలయ హుండీల ద్వారా రూ.3,45,300 ఆదాయం వచ్చిందని తెలిపారు.

వాడపల్లి వెంకన్న దర్శనానికి స్లాట్ విధానం

ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దర్శనాల్లో సాధారణ భక్తులకు ప్రాధాన్యం కల్పించనున్నారు. దీనికోసం తిరుమల తరహాలో వచ్చే నెల 1 నుంచి ప్రతి శనివారం స్లాట్ విధానం అమలు చేయనున్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. వీఐపీ సిఫారసు లేఖలతో వచ్చే భక్తులకు ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు. చంటి పిల్లలు (తల్లి, రెండేళ్ల లోపు పిల్లలు), దివ్యాంగులకు (కాళ్లు లేకుండా పూర్తిగా నడవలేని వారు, చూపు పూర్తిగా కనపడని వారు, దివ్యాంగులతో పాటు ఒక సహాయకుడు) ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ దర్శనం కల్పిస్తారు. ఈ దర్శనం పూర్తిగా ఉచితం. తిరిగి మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకూ వీఐపీ దర్శనాలకు అనుమతిస్తారు. సాయంత్రం 5 గంటల తరువాత సిఫారసు లేఖలపై దర్శనాలను అనుమతించరు.

ఆశా.. నిరాశేనా!

- డెల్టా కాలువల మూసివేత
- క్లోజర్ పనులకు అరకొరగా కేటాయింపులు
- రూ.40 కోట్లు మాత్రమే ఇచ్చిన కూటమి సర్కారు
- పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని రైతుల డిమాండ్



మధ్య డెల్టా ప్రధాన పంట కాలువలో తగ్గిన నీటి ఉరవడి

సాక్షి, అమలాపురం: రబీ పంటకాలం పూర్తి కావడంతో గోదావరి డెల్టా ప్రధాన పంట కాలువలకు జలవనరుల శాఖ అధికారులు క్లోజర్ ప్రకటించారు. నిర్ణీత షెడ్యూలు ప్రకారం ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ప్రధాన కాలువలను ఈ నెల 15 నుంచి మూసివేయాల్సి ఉండగా తొలుత 22వ తేదీకి, తరువాత 27వ తేదీకి వాయిదా వేశారు. వరి రైతులకు అవసరం లేకున్నా, వరి కోతలకు ఆటంకమని తెలిసినా అదనంగా వారం రోజుల పాటు నీరందించారు. అనంతరం తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువల్లోకి నీటి విడుదలను ఆదివారం రాత్రి నుంచి నిలిపివేశారు. తిరిగి జూన్ 1న కాలువలు తెరిచే అవకాశముంది. ఈ నెల రోజులూ పంట కాలువల్లో పూడికతీత, ఇతర మరమ్మతు పనులు పెద్ద ఎత్తున జరుగుతాయని భావించారు. కానీ, కూటమి ప్రభుత్వం అరకొరగా నిధులు కేటాయించడంతో ఆయకట్టు రైతులు క్లోజర్ పనులపై ఆశలు వదులుకున్నారు.

4,366.813 టీఎంసీల ఇన్‌ఫ్లో

గోదావరిలో ఇన్‌ఫ్లో జూన్ 1 నుంచి ఇప్పటి వరకూ మధ్యస్థంగా ఉంది. మొత్తం మీద ఈ కాలంలో **కాటన్ బ్యారేజీ వద్ద 4,366.813 టీఎంసీల ఇన్‌ఫ్లో నమోదైంది. ఇందులో కాలువలకు 252.098 టీఎంసీలు అందించగా, 4,114.715 టీఎంసీల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. పంట కాలువలు మూసివేయడంతో ఆదివారం రాత్రి** నుంచి సోమవారం ఉదయం వరకూ 1,945 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 1,793 క్యూసెక్కులుగా ఉంది.

ఆదుకున్న పోల'వరం'

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు వద్ద గేట్లు ఏర్పాటు చేసి, నీటి నిల్వ సామర్థ్యం పెంచారు. దీంతో, సీలేరు నుంచి వచ్చే నీటిని, సహజ జలాలలను క్రమపద్ధతిలో డెల్టాకు అందించే అవకాశం లభించింది. ఫలితంగా రబీ గట్టెక్కింది. వాస్తవానికి రబీ సాగు, తాగునీటి అవసరాలకు 90 టీ ఎంసీల నీరు సరిపోతుంది. అంతకు మించి 116.806 టీఎంసీల నీటిని సరఫరా చేసినా తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల్లోని శివారు, మెరక ప్రాంతాల్లోని రైతులు పలు సందర్భాల్లో నీటి ఎద్దడిని ఎదుర్కొన్నారు. ఒకవేళ పోలవరం వద్ద నిజంగా నీటి నియంత్రణ లేకుండా ఉండి ఉంటే మార్చి నెల నుంచి మొత్తం సీలేరు మీదనే ఆధారపడాల్సి వచ్చేది. దీనివలన డెల్టాలో రబీ మొత్తం దెబ్బ తినేదని, పోలవరంతో ఆ ముప్పు తప్పిందని రైతులు సైతం అంగీకరిస్తున్నారు.

క్లోజర్‌లో అరకొర పనులు

గోదావరి డెల్టా కాలువలు మూసివేసిన తరువాత చేపట్టే క్లోజర్ పనులు ఈ ఏడాది అరకొరగా సాగనున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని మొత్తం 18 నియోజకవర్గాల్లో ఈ పనులు చేయాలని నిర్ణయించారు. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున పనులు చేస్తామని కూటమి నేతలు తొలుత ఊదరగొట్టారు. తీరా చూస్తే నిధుల కొరత కారణంగా కేవలం రూ.2 కోట్లకే పరిమితం చేశారు. మొత్తం డెల్టా పరిధిలో రూ.40 కోట్లతో మాత్రమే పనులు చేయనున్నారు. ఈ నిధులతో 972 పనులు చేయనున్నట్లు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి క్లోజర్ సమయంలో కాలువల్లో పూడికల తొలగింపు, లాకులు, స్లూయిజ్‌లు, డైరెక్ట్ పైప్(డీపీ)ల మరమ్మతులు, గ్రీజులు పెట్టడం, కొత్త షట్టర్లు వేయడం వంటి పనులు చేయాల్సి ఉంది. మధ్య డెల్టాలో లొల్ల లాకుల నుంచి శివారులోని కాట్రేనికోన మండలం మొక్కలతిప్ప వద్ద ఉన్న చిన్నపాటి రెగ్యులేటర్ వరకూ లాకులు, షట్టర్లు అధ్వానంగా ఉన్నాయి. మరోవైపు తూర్పు గోదావరి జిల్లా పెరవలి తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి. అరకొర నిధులతో వీటిని ఎంతవరకూ మరమ్మతు చేస్తారనేది రైతులకు ప్రశ్నార్థకంగా మారింది.




శిథిలావస్థలో ఆత్రేయపురం మండలం లొల్ల లాకులు

కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టాకు నీరందించారిలా.. (టీఎంసీలు)

రబీ షెడ్యూల్ ప్రారంభం	డిసెంబర్ 7
తూర్పు డెల్టా	34.927
మధ్య డెల్టా	22.094
పశ్చిమ డెల్టా	59.785
మొత్తం	116.806
ఖరీఫ్, రబీ కలిపి (గత ఏడాది జూన్ 1 నుంచి)	
తూర్పు డెల్టా	77.365
మధ్య డెల్టా	47.311
పశ్చిమ డెల్టా	127.422
మొత్తం	252.098


క్లోజర్‌లో పనులు చేయాలి



పంట కాలువలు మూసివేసిన సమయంలో గోదావరి డెల్టాలో మరమ్మతులు తప్పనిసరి. ఈ వ్యవస్థ 1842లో మొదలైంది. స్లూయిజ్‌లు, లాకులు, సర్‌ప్లస్ వియర్లు, అండర్ టన్నెల్స్, అక్విడెక్టులు దెబ్బ తిని నీరు లీకవుతోంది. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. రబీలో 116 టీఎంసీల నీరు ఇచ్చినా కూడా ఎద్దడి ఏర్పడటానికి కాలువల వ్యవస్థ అధ్వానంగా ఉండటమే కారణం. అందువలన డెల్టా ఆధునీకరణ తప్పనిసరి. అది లేకున్నా కనీసం క్లోజర్ పనులైనా చేయాలి.

– **కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి**, రాష్ట్ర నీటి వినియోగదారుల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి, రామచంద్రపురం

కాలువల మరమ్మతులు తప్పనిసరి



డెల్టా కాలువలకు మరమ్మతులు తప్పనిసరి. పంట కాలువలు, మురుగునీటి కాలువలను ఆధునీకరించినప్పుడే రైతులకు వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. ఈ ఏడాది క్లోజర్‌లో పెద్ద ఎత్తున పనులు చేస్తారని ఆశిస్తున్నాం.

– **గారపాటి శ్రీనివాస చౌదరి**, సాగునీటి సంఘం అధ్యక్షుడు, చింతలూరు, ఆలమూరు మండలం

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముమ్మిడివరం: మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నలుగురిలో ఒక యువకుడు ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం మోటారు సైకిల్‌పై ముమ్మిడివరం వైపు వస్తున్న అయినవిల్లి మండలం శంకరాయ గూడేనికి చెందిన ఉందుర్తి బాలబాలాజీ (బాలు) (22), కాకినాడ రూరల్ మండలం గొల్లపాలేనికి చెందిన కొండపల్లి రాజా, అయినవిల్లి మండలం శంకరాయ గూడేనికి చెందిన నిడుమోలు ఉమామహేశ్వర రావు, టి.కొత్తపల్లికి చెందిన బొమ్మి వినోద్‌లను టిప్పర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. వీరిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన బాలబాలాజీ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మిగతా ముగ్గురు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

అమలాపురం టౌన్: పట్టణం సావరం శివారు కొబ్బరి తోటల్లో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను ఎస్సై టి.శ్రీనివాస్ సోమవారం ఉదయం మాటు వేసి పట్టుకున్నారు. అమలాపురానికి చెందిన ధరణికోట బిందు వెంకట సాయి రాహుల్, మేడిశెట్టి సమీర్, అంబాజీపేటకు చెందిన గ్రంధి రాజుల వద్ద గంజాయి ఉండడంతో పాటు, సేవిస్తున్నారన్న నేరంపై అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. బిందు వెంకట సాయి రాహుల్ వేరే ప్రాంతం నుంచి పావు కిలో గంజాయి తెచ్చాడని, తర్వాత ఆ ముగ్గురూ సావరం కొబ్బరి తోటల్లో దానిని సేవిస్తున్నట్లుగా ప్రత్యక్షంగా పట్టుకున్నామని తెలిపారు. సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో అమలాపురం తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్ సమక్షంలో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు. వారి నుంచి పావు కిలో గంజాయి, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టులో వారిని హాజరు పరచగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడంతో వారిని సబ్ జైలుకు తరలించారు.

ట్రిపుల్ ఐటీ సంరంభం..


పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు (ఫైల్)


ట్రిపుల్ ఐటీ భవనం

ఆర్జీయూకేటీ లోగో

- ఆర్జీయూకేటీ నోటిఫికేషన్ విడుదల
- ఆన్‌లైన్‌లో ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- వచ్చే నెల 28 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

రాయవరం: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ)లో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల నోటిఫికేషన్ ఈ నెల 24న విడుదల చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల చూపు అంతా ట్రిపుల్ ఐటీ వైపు మళ్లింది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో భాగంగా రాష్ట్రంలో ఉన్న 4 వేల ట్రిపుల్ ఐటీ సీట్లలో జిల్లాకు ఎన్ని సీట్లు కేటాయిస్తారు.. ఎన్ని సీట్లు వస్తాయనే సందిగ్ధంలో విద్యార్థులు ఉన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. జూన్ 11 నుంచి 17వ తేదీ వరకు స్పెషల్ కేటగిరీ (పీహెచ్/ఎన్‌సీసీ/స్పోర్ట్స్/భారత్ స్కౌట్స్) సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్దేశించిన ఐఐఐటీల్లో చేపట్టనున్నారు. అడ్మిషన్ల అనంతరం ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభిస్తారు.

నాలుగు వేల సీట్లు

రాష్ట్రంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఒక్కో చోట వెయ్యి సీట్ల వంతున నాలుగు వేల సీట్లు ఉన్నాయి. వీటికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన 48,448 మంది మధ్య ఈ పోటీ ఉంటుంది.

నాడు వైఎస్ చలువతో

గ్రామీణ విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్యనందించేందుకు 2008లో అప్పటి ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇడుపులపాయ, నూజివీడు, తెలంగాణ రాష్ట్రంలోని బాసరలో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారు. ప్రారంభంలో అధిక సీట్లు కేటాయించగా, 2010లో ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1000 సీట్లు ఉండేలా కుదించారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం బాసర ట్రిపుల్ ఐటీ తెలంగాణకు వెళ్లిపోవడంతో 2016లో ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలు ప్రారంభించారు. ట్రిపుల్ ఐటీల్లో 26 జిల్లాల విద్యార్థులకు సమానంగా సీట్లు ఇచ్చేందుకు వర్శిటీ అధికారులు నిర్ణయించి 4వేల సీట్లలో ఓపెన్ కేటగిరీలో 600 సీట్లను స్థానికేతరులు, తెలంగాణ, ఎన్ఆర్ఐ, తదితరులకు కేటాయిస్తారు. మిగిలిన 3,400 సీట్లను 26 జిల్లాల వారికి సమానంగా కేటాయిస్తారు. జిల్లాకు కేటాయించే సీట్ల ఆధారంగా మెరిట్ విద్యార్థులకు అవకాశం లభించనుంది.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే అధిక సీట్లు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివిన విద్యార్థులకే ట్రిపుల్ ఐటీలో అధిక సీట్లు వచ్చే అవకాశం ఉంది.

ఎంపిక ప్రక్రియ ఇలా

ఎంపిక ప్రక్రియలో భాగంగా ఇరువురు విద్యార్థులకు మార్కులు సమానంగా వస్తే తొలుత గణితం, అనంతరం జనరల్ సైన్స్, తదుపరి ఇంగ్లిషు, ఆ తదుపరి సోషల్ స్టడీస్, ఫస్ట్ లాంగ్వేజన్‌లో అధిక మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యమిస్తారు. అప్పటికీ సమానంగా వస్తే పుట్టిన తేదీ ప్రకారం అధిక వయసు ఉన్న వారిని, హాల్ టికెట్ నంబర్ నుంచి పొందిన అత్యల్ప సంఖ్య ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఇలా

ట్రిపుల్ ఐటీలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌జీయుకేటీ.ఇన్/ఏపీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. బీసీ, ఈడబ్ల్యూఎస్, ఓసీ విద్యార్థులకు దరఖాస్తు రుసుం రూ.300గా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200గా నిర్ధారించారు.

రిజర్వేషన్లు ఇలా

ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లకు రిజర్వేషన్ నిబంధనలు పాటిస్తారు. రాష్ట్రంలోని అభ్యర్థులకు 85 శాతం సీట్లు, మిగిలిన 15 శాతం సీట్లు రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు కేటాయిస్తారు.

ఎస్సీ–15, ఎస్టీ–6, బీసీ(ఎ)–7, బీసీ (బి)–10, బీసీ (సి)–1, బీసీ (డి)–7, బీసీ (ఇ)–4, దివ్యాంగులు–5, ఆర్మీ ఉద్యోగుల పిల్లలు (సీఏపీ)–2, ఎన్‌సీసీ–1, స్పోర్ట్స్–0.5, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్–0.5 శాతం సీట్లు కేటాయిస్తారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రత్యేక కేటగిరీల్లో బాలికలకు 33.1/3 శాతం సీట్లు కేటాయిస్తారు.

ముఖ్యమైన తేదీలు

- నోటిఫికేషన్ తేదీ ఏప్రిల్ 24.
- ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ ఏప్రిల్ 27 నుంచి మే 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు.
- ఆన్‌లైన్ స్పెషల్ కేటగిరీ (చిల్డ్రన్ ఆఫ్ ఆర్మ్‌డ్ పర్సనల్) విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన మే 28, 29 తేదీలలో.
- స్పోర్ట్స్ కేటగిరి విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన: మే28 నుంచి 30 వరకు.
- భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన మే 29న.
- ఎన్‌సీసీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మే 29 నుంచి 31 వరకు.
- ప్రొవిజినల్ సెలక్షన్ (స్పెషల్ కేటగిరీ కాని విద్యార్థులు) జూన్ 05.
- నూజివీడు క్యాంపస్‌కు ఎంపికైన వారి సర్టిఫికెట్ల పరిశీలన జూన్ 11, 12 తేదీలు
- ఆర్కే వ్యాలీ, ఇడుపులపాయ క్యాంపస్‌లకు ఎంపికైనవారికి జూన్ 12, 14 తేదీలు
- శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైన వారికి జూన్ 16, 17 తేదీలలో
- ఎంపికైన విద్యార్థులు ఆయా క్యాంపస్‌ల్లో రిపోర్టు చేయాల్సిన తేదీ జూన్ 30

4న అంబేడ్కరీయం

రాజమహేంద్రవరంలో శతాధిక కవి సమ్మేళనం

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం వీఎల్ పురం సమీపంలో గల ఎల్ఐసీ భవనం వద్ద మే 4వ తేదీన అంబేడ్కరీయం అనే అంశంపై శతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు అమలాపురానికి చెందిన ఆ సమ్మేళనం కన్వీనర్ డాక్టర్ బీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమ బ్రోచర్లను స్థానిక కూచిమంచి అగ్రహారంలో శ్రీశ్రీ కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు తదితరులు సోమవారం ఆవిష్కరించారు. రాజమహేంద్రవరానికి చెందిన గుబ్బల రాంబాబు సారథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవా కేంద్రం నిర్వహణలో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో పాల్గొనేందుకు ఇప్పటికే వంద మందికి పైగా కవులు తమ పేర్లను రిజిస్ట్రేషను చేయించుకున్నారని చెప్పారు. ఆసక్తి ఉన్న కవులు 99122 33739 ఫోన్ నెంబరును సంప్రందించాలని కన్వీనర్ సత్యనారాయణ సూచించారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ జరిగే ఈ సమ్మేళనంలో అంబేద్కర్ భావజాలం కలిగిన అన్ని వర్గాల అంబేద్కరీయులైన కవులు పాల్గొని కవితా గానాలు వినిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోలీసుల అదుపులో చోరీ కేసుల నిందితుడు

తుని: స్థానిక రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఏలూరుకు చెందిన షేక్ రహీంను అదుపులోకి తీసుకున్నట్టు జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు సోమవారం రైల్వే డీఎస్పీ జయరాం ప్రసాద్ పర్యవేక్షణలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సంయుక్తంగా తుని రైల్వేస్టేషన్‌లో ఎంఎస్‌సీడీ (ఫింగర్ ప్రింట్ డివైస్) ద్వారా ముమ్మర తనిఖీలు నిర్వహించారు. అనుమానస్పద వ్యక్తి వేలిముద్ర చెక్ చేయగా ఏలూరుకు చెందిన షేక్ రహీంగా గుర్తించారు. దీంతో ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా అతడు పలు దొంగతనాల్లో అరెస్ట్ అయినట్లు, ప్రస్తుతం అతనిపై నాన్ బెయిల్ బెల్ వారెంట్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. దీంతో రహీంను అక్కడి పోలీసులకు అప్పగించినట్టు ఎస్సై తెలిపారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మైనారిటీలకు సబ్సిడీతో కూడిన రుణాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సునీల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తుదారుల వయసు 21 నుంచి 55 ఏళ్ల లోపు ఉండాలనీ, అభ్యర్థులు రైస్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రాలతో దగ్గరలోని మీ–సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు కార్యాలయ ఫోన్ నెంబర్ 0884 2351483లో సంప్రదించాలన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కాకినాడ లీగల్: స్నేహితుల మధ్య గతంలో జరిగిన గొడవల విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ పెరిగి ఒకరిపై మరొకరు బీరు బాటిల్‌తో అనేక చోట్ల పొడిచి హత్య చేసిన కేసులో జీవిత ఖైదు, రూ.పది వేల జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాట్రేనికోన మండలం, పల్లం గ్రామానికి చెందిన మల్లాడి రవికాసు, పాలేపు కాసుబాబు స్నేహితులు. వీరితో పాటు కొందరు స్నేహితులు 2022 జూన్ 9న కాకినాడ ఎస్ఆర్ గ్రాండ్ హోటల్‌లో మద్యం తాగారు. అనంతరం కాసుబాబు రూమ్‌లో ఉండగా రవికాసుతో పాటు మిగిలినవారు ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. కాగా రవికాసు గతంలో జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకుని తిరిగి రూమ్‌కు వచ్చి కాసుబాబును మద్యం సీసా పగులగొట్టి విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశాడు. కాసుబాబు సోదరుడి ఫిర్యాదు మేరకు సీఐ పెదిరెడ్డి రామచంద్రరావు కేసు దర్యాప్తు చేశారు. విచారణలో రవికాసుపై నేరం రుజువు కావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పీవీఎస్ జయలక్ష్మి ప్రాసిక్యూషన్ నిర్వహించారు. ఆమెతో పాటు, సీఐ పెదిరెడ్డి రామచంద్రరావు, ప్రస్తుత సీఐ మజ్జి అప్పల నాయుడు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదం కేసులో రెండేళ్ల జైలు

గోకవరం: ఆటో నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్ష పడినట్టు ఎస్సై పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. 2020వ సంవత్సరంలో కొత్తపల్లికి చెందిన పిల్లల రాంబాబు ఆటోను నిర్లక్ష్యంగా నడపడంతో ఇద్దరు మృతిచెందారన్నారు. అప్పటి ఎస్సై పి.చిన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరం మొదటి అదనపు అసిస్టెంట్ జిల్లా కోర్టు జడ్జి బి.పద్మ రెండేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రాధాకృష్ణరాజు వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుళ్లు జి.మణికంఠ, కె.మణికంఠ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారన్నారు.

జాతీయ బోట్‌గేమ్ పోటీల్లో వర్షిత ప్రతిభ


కాంస్య పతకం సాధించిన వర్షిత

పెదపూడి: భోపాల్‌లోని లోయర్‌లేక్ వేదికగా ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహించిన 35వ జాతీయ కెనోయ్ స్ప్రింట్ (బోట్‌గేమ్) చాంపియన్‌షిప్ పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన గొలుగూరి వర్షిత కాంస్య పతకం సాధించిందని ఆమె తల్లిదండ్రులు రాజేష్‌రెడ్డి, విజయలక్ష్మి సోమవారం తెలిపారు. అనపర్తిలో వారు మాట్లాడుతూ సబ్ జూనియర్ కె4 500 మీటర్ల విభాగంలో కాంస్య పతకం సాధించినట్టు తెలిపారు. వర్షిత ప్రస్తుతం విజయవాడలోని ఎస్ఎస్ఎం పాఠశాలలో 8వ తరగతి చదువుతోందన్నారు.

తువ్వమట్టి లారీల వీర విహారం

టిప్పర్ ఢీకొని వృద్ధుడి మృతి

పి.గన్నవరం: వాడ్రేవుపల్లి శివారు చాకలిపాలెం సెంటర్‌లో సోమవారం వేగంగా వస్తున్న తువ్వ మట్టి లారీ ఢీకొని సైకిల్‌పై వెళ్తున్న ఒక వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల మేరకు రాజోలు మండలం తాటిపాక గంగయ్య కాలనీకి చెందిన మద్దుల గోపాలం (78) సోమవారం సైకిల్‌పై చాకలిపాలెం సెంటర్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా, యర్రంశెట్టివారిపాలెం ర్యాంపు నుంచి వస్తున్న తువ్వ మట్టి లారీ అతనిని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మండలంలోని పలు ర్యాంపుల నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు మితిమీరిన వేగంతో దూసుకు వెళ్తూ స్థానికులు, ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. లారీల్లోని మట్టి ఎగిరి వాహన చోదకుల కళ్లలో పడి ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం మొండెపులంక వద్ద టిప్పర్ ఢీకొని ఇద్దరు తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. లారీల వేగానికి పోలీసులు, రవాణా శాఖ అధికారులు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

దిగుబడి బాగున్నా దయనీయమే!


గోకవరంలో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న తంటికొండ రైతులు

- ధాన్యం కొనండి మహాప్రభో అని వేడుకుంటున్న అన్నదాతలు
- టార్గెట్ మీరలేమంటున్న కొనుగోలు కేంద్రాల సిబ్బంది
- తలలు పట్టుకుంటున్న రైతులు

గోకవరం: చివరి ధాన్యపు గింజ వరకు కొంటాం.. రైతు సంక్షేమమే లక్ష్యం.. ఇవీ నిత్యం కూటమి ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలు. క్షేత్రస్థాయిలో అందుకు పూర్తి విరుద్ధం. కొనుగోలు కేంద్రాల వద్ద ఇంత ధాన్యమే కొనాలని లక్ష్యం విధిస్తే అంతకు మించి సరకును రైతులు తీసుకువస్తే ససేమిరా.. మేమింతే కొంటామని కొనుగోలు కేంద్రాల సిబ్బంది పొమ్మంటే అన్నదాత పరిస్థితి ఏమిటి? ఎవరైనా పంట వేస్తే దిగుబడి బాగా రావాలనే వేస్తారు. ఆశించినట్టే దిగుబడి వచ్చినా అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్నట్టు పరిస్థితి ఉంటే ఆ రైతు ఎవరికి చెప్పుకోవాలి? ఇదే పరిస్థితి మండలంలోని తంటికొండ రైతులకు ఏర్పడింది. ఈ పరిస్థితిపై రైతులు సోమవారం అధికారులకు మొర పెట్టుకున్నారు. గ్రామానికి చెందిన రైతులు రబీసాగులో 876 ఎకరాల్లో ఎంటీయూ 1121 రకం ధాన్యాన్ని, 12 ఎకరాల్లో 1156 రకాన్ని పండించి ఈ–క్రాప్ నమోదు చేయించుకున్నారు. సుమారు 33,779 క్వింటాళ్ల దిగుబడి రాగా 16,110 క్వింటాళ్ల రైతు భరోసా కేంద్రం ద్వారా విక్రయించారు. అయితే వ్యవసాయశాఖ సిబ్బంది టార్గెట్ లేదని వారి వద్ద ఉన్న సుమారు 14,169 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. దళారులకు విక్రయిద్దామంటే గిట్టుబాటు ధర రావడం లేదని, ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే తాము అప్పులపాలవుతామని రైతులు అధికారుల వద్ద వాపోయారు. ధాన్యం టార్గెట్‌ను పెంచి తమ వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తహసీల్దార్ సాయిప్రసాద్, ఎంపీడీఓ గోవిందు, ఏఓ రాజేశ్వరిలను వేడుకున్నారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	23,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కాకినాడ సిటీ: స్థానిక న్యూ పోర్ట్ రైల్వే స్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫాం దిగువన రైతుల పట్టాల వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు జీఆర్పీ ఎస్ఐ వాసు తెలిపారు. మృతుడికి సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. ఐదు అడుగుల మూడు అంగుళాల ఎత్తు, చామన ఛాయ కలిగి ఉండి బ్లూ కలర్ ట్రాక్ ప్యాంట్ సిమెంటు కలర్ టీషర్టు దానిపై ఫ్రంట్ సైడ్ బ్లాక్ అండ్ వైట్ డిజైన్ ఉందన్నారు. కుడికాలుకు దిష్టి పూసలతాడు, మెడలో ఎర్రతాడు, చేతికి ఎర్రతాడు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసిన వారు 85558 56876 నంబర్‌కు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

వీర్లపై వారి వైఖరేమిటో!

- నివేదిక సమర్పించి నాలుగు రోజులైనా వీడని సందిగ్ధత
- సింహగిరి చందనోత్సవం తరువాతేనని ఊహాగానాలు
- పరిశీలనలో ముగ్గురు ఆర్జేసీలు, ఒక డీసీ పేర్లు


రత్నగిరి సిబ్బందితో గత మంగళవారం విచారణ నిర్వహిస్తున్న ఏడీసీ చంద్రకుమార్

అన్నవరం: రత్నగిరిపై ఇటీవల నెలకొన్న వివాదాలు, ఈఓ వీర్ల సుబ్బారావు వ్యవహార శైలి, ఆయన కుమారుడి జోక్యం, తదితర అంశాలపై దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.చంద్రకుమార్ విచారణ జరిపి నివేదిక సమర్పించి నాలుగు రోజులైనా తదుపరి చర్యలపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది.

ఆ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌కు ఇచ్చిన నివేదికలో సాక్షిలో వచ్చిన పలు కథనాల ఆధారంగా పలువురు ఉద్యోగుల అభిప్రాయాలను సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ నమోదు చేసిన రికార్డులను పొందుపరచారు. దేవస్థానంలో సూపరింటెండెంట్లు, ఏఈఓలతో 22వ తేదీ, మంగళవారం ఏడీసీ చంద్రకుమార్ సమావేశమై విచారణ నిర్వహించారు. తరువాత ఈఓ వీర్ల సుబ్బారావుతో కూడా ఆయన మాట్లాడారు.

కమిషనర్ బిజీతో ఆలస్యం?

కాగా, సింహాచలం దేవస్థానంలో ఈ నెల 30వ తేదీన అక్షయ తృతీయ సందర్భంగా చందనోత్సవ ఏర్పాట్లలో కమిషనర్ రామచంద్రమోహన్ తలమునకలైన ఉండడం వల్లే రత్నగిరి వ్యవహారాల్లో చర్యలు ఆలస్యమవుతున్నట్టు తెలుస్తోంది. 29వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ప్రారంభం కానున్న చందనోత్సవానికి సుమారు 300 మంది సిబ్బందిని వివిధ దేవస్థానాల నుంచి డెప్యుటేషన్‌పై తరలించారు.

ఈఓ బదిలీపై ఊహాగానాలు

నివేదిక ఆధారంగా ఈఓ వీర్ల సుబ్బారావును రత్నగిరి నుంచి బదిలీ చేస్తారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే మే ఏడో తేదీ నుంచి సత్యదేవుని కల్యాణోత్సవాలు సాగనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియ కొంత నెమ్మదించవచ్చనే అభిప్రాయాలు సైతం వినిపిస్తున్నాయి.

పరిశీలనలో నలుగురి పేర్లు

ఈఓ సుబ్బారావు బదిలీ జరిగితే ఆ స్థానంలో ఎవరిని నియమించాలనేదానిపై ఇప్పటికే కసరత్తు మొదలైనట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో ఇక్కడ ఈఓలుగా పని చేసిన ముగ్గురు ఆర్జేసీల పేర్లు వినిపిస్తున్నాయి. వారిలో ఇద్దరు దేవస్థానం ఈఓలుగా పనిచేస్తుండగా, ఒకరు సెలవులో ఉన్నారు. మరో ఆర్జేసీ శాఖాపరమైన పోస్టులో ఉన్నారు. కాగా, గతేడాది డీసీగా పదోన్నతి పొందిన అధికారిని ఈఓగా నియమించాలని టీడీపీకి చెందిన మెట్ట ప్రాంత సీనియర్ ఎమ్మెల్యే సిఫారసు చేసినట్టు సమాచారం. ఆర్జేసీ పదోన్నతుల జాబితాలో ఆయన స్థానం రెండోది. అందువల్ల ఆయనను ఈఓగా నియమించి ఆ తరువాత పదోన్నతి కల్పిస్తారనే ప్రచారం సాగుతోంది.

కొనసాగేలా ఈఓ పావులు


ఈఓ వీర్ల సుబ్బారావు

కాగా, దేవస్థానం ఈఓగా తనను కొనసాగించాలని ఈఓ వీర్ల సుబ్బారావు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఆయన ఇటీవల ఒక టీడీపీ మాజీ మంత్రి, సీనియర్ నాయకుడిని కలిసి చర్చించారని ఆయన కమిషనర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారని అంటున్నారు. అలాగే ఇతర ఎమ్మెల్యేలను కూడా ఆయన కలుస్తున్నట్టు సిబ్బంది చెప్తున్నారు.